కథానిక

# ఒక చూపు

రచన.
శ్రీ. బాబు.

చిరంజీవి పద్మమునకు!

ఉభయకుశలోపరి. ఇది ఫైనల్ యియర్ కాబట్టి శ్రద్ధగా చదువుచున్నావని తలంచెదను. మేము నీమీద ఆశలు పెట్టుకొనియున్నాము.

ఈ సంవత్సరము నిను పెళ్ళిచేయాలని మీ అమ్మ పట్టు బట్టుచున్నది. మొన్ననే మన దూరపు బంధువులవద్ద నుండి ఒక సంబంధం వచ్చినది. ఆ సంబందం మీ అమ్మకూ, నాకూ నచ్చినది. కొద్దిరోజుల్లో ఆ సంబంధం స్థిరపరచెదము. మేమేది చేసినా నీ మేలుకోరే గనుక నీవు తప్పక అంగీకరించెదవని ఆశిస్తాను.

ఇట్లు,
జగన్నాథం.

అప్పుడే కాలేజినుండి వచ్చి వుత్తరం చదువుకొన్న పద్మంను కళ్ళు బైర్లు కమ్మినై. శ్యామల అనే కాలేజి అమ్మాయిని ప్రేమించి, ఆమె ప్రేమను పొందటానికి ప్రయత్నించే సమయంలో యీ వుత్తరం వచ్చింది. తన అనంగీకారం తండ్రికి తెలియజేయాలని నిశ్చయించుకొని, మరునాడు శ్యామల మహాబలిపురం వెళుతోంది గాబట్టి తానూ వెళ్ళి ఆమెతో యెట్లా పరిచయం చేసుకోవాలా అని ఆలోచిస్తూ నిద్రపోయాడు.

* * *

మహాబలిపురం చేరిన శ్యామల శిల్పాలు, రథాలు, గుడి అన్నీ చూసింది. చివరికి లైట్‌హౌస్‌మీది కెక్కింది. కాని అంత యెత్తునుండి సముద్రమూ, పరిసరాలు చూసేసరికి కళ్ళు తిరిగినై. తరువాత యేమి జరిగిందీ ఆమెకు తెలియదు.

కొంతసేపటికి కళ్ళు తెరచి చూసేసరికి ఒక అపరిచిత వ్యక్తి తొడపై తన తలవుంది. అతడామె నోట్లో నీళ్ళు పోస్తున్నాడు. ఆమె సిగ్గుతో ఒక్కసారి లేవబోయింది. కాని ఓపిక లేకపోవటంతో లేవలేకపోయింది. ఇది గమనించి అతనామె తలక్రిందనుండి తన తొడను తొలగించి దాని స్థానంలో వాటర్ బాటిల్ వుంచి 'కొంచం విశ్రాంతి తీసుకోండి' అన్నాడు.

కొంచంసేపట్లో ఆమె లేచి కూర్చొని అతని వైపు కృతజ్ఞతాభావంతో చూసింది.

'కొంచెం కాఫీ త్రాగుతారా' అన్నాడు.

'థాంక్స్. అక్కర్లేదండీ'

'సరే. అసలేం జరిగిందండీ?' అన్నాడు.

'ఏముందండీ. మహాబలిపురంలో విశేషాలన్నీ చూచి వెళ్ళిపోబోతూ ఊరంతా ఒక్కసారే చూడొచ్చుగదా అని లైట్‌హౌస్ ఎక్కాను. ఒక్కసారి చుట్టూ చూసేసరికి కళ్ళు తిరిగినై. మళ్లీ మామూలు పరిస్థితికొచ్చేసరికి ......దేవుళ్ళా వచ్చి కాపాడారు. థాంక్సండీ' అంది శ్యామల.

'అయ్యో అదేంటండీ. నేనేం దేవుళ్ళా రాలేదు. మీకులాగానే పోబోతూ మహాబలిపురమంతా ఒకేసారి చూడాలనే ఆశతో లైట్‌హౌస్ ఎక్కాను. తీరా ఎక్కింతర్వాత మహాబలీపురం శిల్పాలు చూడలేదుగానీ యీ......' అంటూ ఆమె వంక తదేకదృష్టితో చూడసాగాడు.

సిగ్గుతో ఆమె చెక్కిళ్ళు యెరుపెక్కాయి 'కానీ యీ......ఆపేళాకేం?'

'ఆపకపోతే ప్రమాదమని'

'ఆమాత్రం భయముందిగదా. ఫర్వాలేదు. ఇంతకూ మీ పేరూ, వూరూ చెప్పారుగారు.'

'అరే! ఎప్పుడో అడిగినట్లే మాట్లాడుతారే.'

'ఇప్పుడడుగుతున్నాగా చెప్పండి.'

'సరే. నా పేరు పద్మం. నివాసం మద్రాసు. మరి మీ సంగతో' అని ప్రశ్నించాడు తనకేమీ తెలియనట్లు.

'నా పేరు శ్యామల. ఊరు మీ వూరె.'

'ఊరు మీ వూరే' అనేసరికి పద్మంకు చక్కిలిగింత పెట్టినట్లయింది. కాని మామూలుగానే 'కాలేజీలో చదువుకొంటున్నారా?' అన్నాడు.

'అవును. మీరూ అంతేగనా?'

'అవును.'

'సరే ఇక మద్రాసుకు బయల్దేరుదామా?'

'అప్పుడేనా? మహాబలిపురమంతా వకేసారి చూడరూ?'

'చూసినంతవరకు చాల్లెండి' అంది సిగ్గుపడుతూ.

'ఏమ్. భయపడుతున్నారా? మరేం ఫర్వాలేదు. నేనున్నా రండి.'

'ఊ' అని అతనితోపాటు లైట్‌హౌస్‌చుట్టూ ప్రదర్శనం చేస్తూ చుట్టూవున్న దృశ్యాలనుచూచి పరవశం చెంది 'బ్రతికినంతకాలం యిలా వుంటే బావుండునండీ' అంది.

'ఎట్లాగండీ?' అన్నాడు పద్మం అమాయకంగా.

ఆ మాటలోని వ్యంగ్యం గమనించిన శ్యామల తనను తాను సంబాళించుకొని 'ఇట్లాగేనండీ. ఇలాంటి శిల్పాలను చూస్తూ, ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదిస్తూ'అంది.

'ఆనందిస్తూ...అంతేనా' అన్నాడు పద్మనాభం.

'మీరేమనుకున్నారు?'

'అబ్బే, నేనేం అనుకోలేదండీ' అన్నాడు పద్మం, తప్పుచేసినవాడిలా మొహం పెట్టి.

'అండీ' మానికేశి 'శ్యామలా' అంటే ఎంతో బాగుంటుందండీ?'

'బాగానే వుంటుందేమోగానండీ, గండీ వుంది కదండీ.'

'గండియా?' అని కొంచం ఆలోచించి చిరునవ్వుతో 'తీసివేస్తే పోలా' అంది.

'నిజంగా నాకంత అదృష్టమా' అన్నాడు పద్మం, తన రెండు చేతులనూ శ్యామల భుజాలమీద వుంచుతూ.

'ఏమో మరి. మీ అదృష్టమో, నా అదృష్టమో' అని కిలకిల నవ్వుతూ, అతని చేతిని తన చేతిలోకి తీసికొని, తన కారువైపు తీసుకుపోయింది.

* * *

'నాన్నా, నాన్నా'

..............

'నాన్నోయ్'

'ఆ. వస్తున్నా. యేమిటమ్మా హడావుడీ?'

'హడావుడీలేదు. యేమీలేదు. ఎవరిని తీసుకొచ్చానో చూడు. ఈయనే మొన్న మహాబలిపురంలో నన్ను రక్షించింది. పేరు పద్మం. ఇక్కడ కాలేజీలో చదువుకొంటున్నారు' అంది శ్యామల.

'అలాగా. చాల సంతోషం నాయనా. మా అమ్మాయిని ఆపదనుండి కాపాడావు. నిలబడే వున్నావేం. కూర్చో' అంటూ తన యెదురుగావున్న కుర్చీ చూపించి తనూ కూర్చున్నారు.

'అమ్మాయ్, నీవు పోయి కాఫీ తీసుకరా అమ్మా'

'సరే నాన్నా. ఇప్పుడే వస్తా. మాట్లాడతా కూర్చోండి.'

శ్యామల యింట్లోకి వెళ్ళగానే వాళ్ళిద్దరూ సంభాషణలో పడ్డారు. పద్మం పూర్తి, యితర వివరాలూ తెలిసికొన్న ఆయనకు ఆశ్చర్యమూ, సంతోషమూ కలిగాయి. కాని బయటపడకుండా.

'ఇప్పుడు నీ బస యెక్కడ' అని అడిగారు.

'ట్రిప్లికేన్ హైరోడ్‌లో రూము తీసుకొన్నానండీ.

'భోజనం హోటల్లోనా?'

'అవునండీ.'

సరే. నెలరోజుల్లో పరీక్షలు. హోటల్లో భోజనము. బాగుంది. పరీక్షలైన తరువాత నీవు దేనికైనా పనికి వస్తావా. నీకేమీ అభ్యంతరం లేకపోతే యీ నెల రోజులూ మా యింట్లోనే వుండిపో.'

'అబ్బే మీకెందుకండీ శ్రమ.,

'శ్రమా లేదు గిమా లేదు. ఇక్కడే వుండిపో.'

లోలోపల సంతోషిస్తూ, బలవంతంమీద వప్పుకొన్నట్లు 'సరేనండీ' అన్నాడు పద్మం.

ఇంతలో కాఫీతో తయారైంది శ్యామల. కాఫీ త్రాగుతూ 'పరీక్షరోజులూ, బయటైతే యిబ్బందిగా వుంటుందని పద్మంను మనింట్లోనే వుండమంటున్నాను.'

శ్యామల ఆనందంతో వుక్కిరిబిక్కిరై పైకిమాత్రం తనకొక విషయంలో ఆసక్తి లేనట్లు 'నీ యిష్టం నాన్నా' అంది.

* * *

తను కోరుకున్నవాడే తన కళ్లెడౌతున్నందుకు శ్యామల తండ్రి రంగనాథంగారు రుక్కిరిబిక్కిరై కాబోయే బావగారైన జగన్నాథంగారి నేడిపించాలనే వుద్దేశంతో పెళ్లివిషయం హెచ్చరిస్తూ ఆయనకు వుత్తరం వ్రాశారు.

ఆ వుత్తరం చూసుకొన్న జగన్నాథంగారు కొడుకుతో మాట్లాడటానికి వెంటనే పట్నం బయలుదేరారు.

పద్మం యిచ్చిన అడ్రసు ప్రకారం జగన్నాథంగారు అతని రూముకు వెళ్లారు. పద్మం అక్కడ వుండటం లేదని తెలిసి, అతని మిత్రుని సహాయంతో అతనుండే యింటికి వచ్చారు.

హాల్లో కూర్చొని చదువుకొంటున్న పద్మం తండ్రిని జూచి షాక్ తిని, తేరుకొని ఆయనను కూర్చోబెట్టి 'ఏమిటి నాన్నా వుత్తరంగూడా వ్రాయకుండా వచ్చారు' అన్నాడు.

'అనుకోకుండా బయలుదేరాగాని యింతకూ నీవు రూమెప్పుడు మార్చావు?'

'అంతా నాలుగైదురోజులౌతుంది నాన్నా.'

'ఈ యిల్లెవరిదీ?'

'మా...అ...కాలేజ్ మేట్ ఒకరిది నాన్నా. నాకు వంట్లో బాగుండకపోతే, నన్ను యిక్కడే వుండమని బలవంతం జేశారు. అనారోగ్యంగురించి తెలియచేయ వలసి వస్తుందని యీ అడ్రసు యివ్వలేదు.'

'సరే. బాగానేవుంది. ఎన్ని ఉత్తరాలు వ్రాసినా సరిగా సమాధానమివ్వవ్.'

'వ్రాస్తూనే వున్నాగా నాన్నా.'

'ఏం వ్రాయటమ్. ఒక్క వుత్తరంలోగూడా పెళ్ళి విషయం ప్రస్తావించలేదు.'

'పెళ్ళికిప్పుడేమి తొందర?'

'ఇప్పుడు కాకపోతే మరెప్పుడు. నీ చదువు పూర్తి కావస్తోంది. యీ వూళ్లోనే నీకొక సంబంధం చూశాం. నీవు అంగీకరించాలి.'

'క్షమించాలి నాన్నగారూ, నేనింతవరకు మీమాట కెదురాడి యెరుగను. నే నిదివరకే ఒకమ్మాయిని ప్రేమించాను. పెళ్లి చేసుకుంటాను.'

అంతేనా? అయితే యివాళతో నీకూ నాకూ ఏ సంబంధమూ లేదు. నా కసలుకొడుకే పుట్టలేదను కుంటాను, అంటూ చిరుబురులాడుతూ జగన్నాథంగారు బయటికి వచ్చేశారు.

బజార్లో జగన్నాథంగారికి రంగనాథం కనుపించి 'నమస్తే జగన్నాథంగారు. ఎప్పుడు వచ్చారు'' అని క్షేమసమాచారాలు విచారించారు.

తరువాత జగన్నాథంగారు 'రంగనాథంగారూ, నన్ను క్షమించాలి. మావాడు యెంత జెప్పినా మీ సంబంధానికి ఒప్పుకోవటం లేదు. ఎవరినో ప్రేమించాట్టా, ఆమెనే పెళ్ళాడాలట' అన్నారు బాధగా.

'అలాగా అండీ. ఇప్పుడు నా భారం సగం తీరినట్లయింది. మా అమ్మాయీ ఎవరినో ప్రేమించిందంటా. మీ సంబంధానికి వప్పుకోవటం లేదు. ఈ పిల్లలతో వచ్చిన చిక్కేనండీ. మనమేదో వాళ్ళ మంచిగోరి చెయ్యబోతాం. సమయం వచ్చేసరికి యెదురుతిరిగి కూర్చుంటారు. సరే, ఇద్దరం వకే అవస్థలో పడ్డాం. అయిందేదో అయిపోయింది. దీనివల్ల మన బాంధవ్యం చెడకుండా యెప్పటివలెనే వుండాలని నా కోరిక' అన్నారు రంగనాథంగారు.

'అంతకంటేనా?'

'అయితే యివాళ మా అమ్మాయి పెళ్లితాంబూలాలు పుచ్చుకోబోతున్నాం. ఆ సమయంలో మీరుగూడా వుండాలి. మా యింటికి రమ్మని నా ప్రార్ధన'' అని జగన్నాథంగారు దానికి వప్పుకోవటంతో, దగ్గర్లోనే వున్న తన మిత్రుసియింటికి తీసుకుపోయి, ఆయనను ముందింట్లో కూర్చోబెట్టి తాను యింట్లోకిపోయి కొద్దిసేపు యెవరితోనో మాట్లాడి బయటకు వచ్చాడు. ఇద్దరూ సంభాషణలో పడ్డారు.

కాఫీ, ఫలహారాలు సేవిస్తూవుండగా ఒక పెద్దమనిషి శాస్త్రిలుగార్ని వెంటబెట్టుకు అచటికి వచ్చారు. కొద్ది సంభాషణానంతరం రంగనాథంగారు 'ఒక మంచి పెళ్ళి ముహూర్తం చూడండి శాస్త్రిలుగారూ'' అన్నారు.

'వధూవరుల పేర్లు చెప్పండి.'

'వధువు శ్యామల. వరుడు పద్మం' అని వోరకంటితో జగన్నాథంగారివైపు చూశారు రంగనాథంగారు.

వరుడి పేరు వినంగానే కొంచెం కలతపడి, ఏదో ఆలోచించుకొని మెదలకుండాకూర్చున్నారు జగన్నాథంగారు,

'వరుడు తండ్రిపేరు?' అన్నారు శాస్త్రిలుగారు.

'జగన్నాథంగారు.'

జగన్నాథంగారొక్కసారి లేచి నిలబడి, ఆవేశంతో 'ఏమిటిది రంగనాథంగారూ? పరిహాసమా' అన్నారు.

రంగనాథంగారాయనను నెమ్మదిగా కూర్చోబెడుతూ 'ఆవేశపడకండి బావగారూ. పరిహాసంగాదు, హాశ్యమూ గాదు. మీ అబ్బాయీ, మా అమ్మాయీ ఒకరినొకరు ప్రేమించుకొన్నారు. పెళ్ళాడబోతున్నారు.'

'అయితే...'అంటూ జగన్నాథంగారేదో అనబోయారయోమయంగా.

'అవును. మీ అబ్బాయి ప్రేమించినది మా అమ్మాయినే. అంతేకాదు. మీ అబ్బాయి వుంటోంది మా యింట్లోనే. వీళ్ళిద్దరిదీ వకే చూపండీ. మహాబలిపురాన్నంతా ఒకేసారి చూడొచ్చుగదా అని మా అమ్మాయి అక్కడి లైట్‌హౌస్ ఎక్కింది. మీ అబ్బాయికూడా అదే వుద్దేశంతో యెక్కాడు. కాని వీళ్ళిద్దరూ మహాబలిపురాన్ని గాలికివదిలేసి వొకళ్ళనొకళ్లు ఒకే చూపులో ప్రేమించేసుకున్నారట.'

జగన్నాథంగారు ఆనందం దాచుకొని ఆశ్చర్యం ప్రకటిస్తూ 'వాళ్ళు ప్రేమించుకుంటుంటే మీరు నాతో సరసాలాడుతున్నారన్నమాట,'

'అబ్బే మనదేముందండీ. అంతా వాళ్లే...' అన్నారు నవ్వుతూ. ఆ నవ్వుతో జగన్నాథంగారూ, అక్కడున్న మిగతావాళ్ళుకూడా నవ్వు కలిపేశారు.